


## జయంతి పాపారావు

'ఎంత పని చేశావ్ ! ఎందుకలా చేశావ్ !? నా చెవిలో ఓ మాట పడేయకుండా ఎందుకలా చేశావ్ !? ఏ చిన్న పని కూడా నాకు చెప్పకుండా చేయని వాడివి ఇంతపెద్ద పనిని అంత తొందరపడి ఎందుకలా చేశావ్ !? నేనే ఆశ్చర్యపోతున్నాను, ఇతరుల సంగతి వేరే చెప్పాలా!?' నా మిత్రుడు చంద్రం నన్ను నిలదీశాడు.

'నా మీద ప్రేమతో, నామీద అభిమానంతో నన్నాపని చేయకుండా అడ్డుకుంటావని నీతో చెప్పలేదు'

ఆ మాట విన్నాక చంద్రం మరీ ఆశ్చర్యపోయాడు !

'ఆ పని మంచిదా, చెడ్డదా అనే దాని గురించి నేను మాట్లాడ్డం లేదు. నీ భార్య ఏమను కుంటుంది ? నీ కొడుకులు ఏమను కుంటారు? నీ కోడళ్ళు ఏమనుకుంటారు? ఇదంతా నువ్ ఆలోచించావా? ఆలోచిస్తే, ఇలా చేసి వుండే వాడివి కాదు, నీ మనవలు పెద్దయ్యాక ఏమను కుంటారో ఊహించావా?'

'నా కొడుకుల్ని నా శక్తి మేరకు చదివించాను. కష్టపడి శ్రమించి బతకాలని నేర్పాను. వాళ్లకి రెక్కలొచ్చాయి. ఎవరి బతుకు తెరువు వాళ్లు ఏర్పర్చుకున్నారు. ఎవరికి కావాల్సిన మార్గంలో వాళ్లు స్థిరపడ్డారు. సంతోషంగా సుఖంగా బతుకుతున్నారు. ఇంకా వాళ్ల కోసం నేనేమి చేయాలి? ఎందుకు చేయాలి?'

'ఎంత చేసినా పిల్లల కోసం చేయాల్సింది ఎంతో మిగిలే వుంటుంది. వాళ్ళ కోసం జీవితాంతం చేస్తూనే వుండాలి. నాన్నా అమ్మా మా కోసం ఎంత చేశారో అని పిల్లలూ, మా తాతా నాన్నమ్మా మా కోసం ఎంత చేశారో అని మనవలూ గర్వంగా చెప్పుకుంటూ వుండాలి. అదే కుటుంబమంటే ! అదే మనిషికి గొప్ప సంతోషం !'

'ఎంత చేశారో అంటే ఏమిటి? ఎంత ఆస్తి సంపాదించి ఇచ్చారో అన్నదే కదా ! అలాంటి సంతోషం నాకవసరం లేదు.'

'నీ కవసరం లేకపోవచ్చు. అది వేరే సంగతి. అందరికీ కావాల్సిందదే ! అందరూ ఏమనుకుంటున్నారో, ఏమనుకుంటారో ఆలోచించావా?'

నేను మౌనంగా వుండిపోయాను.

అంతలో నా భార్య రచన కాఫీ పట్టుకొచ్చింది. చంద్రం కాఫీ తాగుతూ ఆమె మొహంలోకి పరిశీలనగా చూశాడు. ఆమె అది గమనించలేదు.

'ఏం చెల్లెమ్మా ! ఏంటి విశేషం ! చాలా సంతోషంగా వున్నావ్ !'

'ఏం లేదన్నయ్యగారూ, మీ మిత్రుడు నాతో కూడా చెప్పకుండా నాక్కూడా తెలియకుండా ఓ పని చేసేశారు ! ఇప్పుడే ఆ విషయం ఎవరి ద్వారానో తెలిసింది ! చాలా సంతోషిస్తున్నాను ! అంతే!' అని చిరునవ్వు నవ్వుతూ సంతోషంగా చెప్పింది.

ఆమె అక్కణ్నుంచి వెళ్లిపోయాక, నా మిత్రుడు నామొహంలోకి నిశితంగాచూశాడు.

'నువ్ పొరబడుతున్నావ్ ! ఆమె నిజంగా సంతోషంగా వుందనుకుంటున్నావా? నేను గమనించాను; ఆమె గుండె భగభగ మండిపోతోంది ! నీ మీద ప్రేమతో ఆ మంటల్ని తన గుండెల్లో దాచుకుంటోంది ! అంతే !! నా ముందు నిన్ను నిందించడం, చిన్నబుచ్చడం ఇష్టం లేక ఆమె సంతోషాన్ని నటిస్తోంది. అంతే !' అని చంద్రం తన మనసులో వున్న మాటను చలించిపోతూచెప్పాడు. నేను విన్నాను. అంతే. మౌనంగా వుండిపోయాను. ఆ తరువాత 'నువ్ చాలా తప్పు చేశావ్' అన్నట్లు నా మొహంలోకి కోపంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

నేనూ చంద్రం తరచు కలుసుకుంటూ వుంటాం. వారం రోజులలోపునే మళ్లీ పార్కులో కలుసుకున్నాం. కాలక్షేపపు కబుర్లు కొంతసేపు చెప్పుకున్నాం.

'నువ్ చేసినపని వూళ్లో చాలా మందికి తెలిసిపోయినట్లే వుంది. ఏమను కుంటున్నారో తెలుసా?....ఆయన కుటుంబం ఆదర్శప్రాయ కుటుంబం అనుకున్నాం. తల్లిదండ్రుల పట్ల కొడుకులకు ఎంతో ప్రేమా గౌరవం అనుకున్నాం. కోడళ్లకి ఎంత ప్రేమో అనుకున్నాం. అదంతా నటనేనన్నమాట ! ఆయన అంతపని చేశాడంటే, వాళ్ల మధ్య పైకి కనిపించకుండ ఎంతో ఘర్షణ, ద్వేషం, అశాంతి వున్నాయన్న మాట! అలా అలా ఏవేవో చెప్పుకుంటున్నారు.... నువ్ తప్పు చేశావ్! అనుభవించక తప్పదు. లోకం నోరు మూయలేం కదా! పెళ్లాం పిల్లలకీ కూడా చెప్పకుండా తొందరపడి ఎంతపని చేశావ్ ! నువ్వెలా భరిస్తున్నావో నాకు తెలీదు; నేను మాత్రం చాలా బాధపడుతున్నాను; చేజారిపోయాక నువ్ చేయగలిగింది ఏవీ లేదు; నేను చేయగలిగింది ఏవీ లేదు !' అని నా మిత్రుడు ఎవరేమను కుంటున్నారో నాకు చెప్పడమే కాకుండా, అతడు కూడా చాలా బాధపడ్డాడు. నేను మౌనంగా విని మౌనంగా వుండి పోయాను.

❖ ❖ ❖

కుటుంబ సంబంధాలు చుట్టపు చూపు సంబంధాలుగా మారిపోయాయి. ఎక్కడెక్కడో ఉద్యోగాలు. ఏడాది కొక్కసారైనా రాలేని పరిస్థితి. కొడుకులే కాకుండా కోడళ్లు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. మనవల చదువులు. అందరికీ ఒకేసారి సెలవు దొరకడం కష్టం. వచ్చినా పదిరోజులకంటే కలిసి వుండలేని పరిస్థితి. ఆర్నెల్లు ముందు నుంచీ ప్రయత్నం మొదలెడితే కానీ రావడానికి వీలుపడదు. కలిసి బతికే కుటుంబవ్యవస్థ పోయింది.

ప్రజలకు బతకు తెరువు కావాల్సిన



విజయవాడ చంద్రరాజేశ్వరరావు స్మారక గ్రంథాలయంలో మానస అకాడమి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితల పోటీల బహుమతి మరియు మానస కవితా సౌరభాలు పుస్తకావిష్కరణ సభలో ఆంధ్రరత్నంపన్యారం సాంబశివరావును సన్మానిస్తున్న పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, మానస అకాడమి అధ్యక్షులు సి. హెచ్. వి. బృందావనరావు, ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, ప్రకాశం జిల్లారచయితల సంఘ కార్యదర్శి పొన్నూరి వెంకట శ్రీనివాసులు .

భూమి కొందరికి ఆస్తిగా వుండిపోవడం వల్ల, కొందరి చేతుల్లోకి ఆస్తిగా వెళ్ళిపోతూ వుండడం వల్ల బతుకు తెరువు వేటలో శ్రమజీవులకూ, ఉద్యోగ వర్గాలకూ వలస బతుకుల వ్యవస్థ వచ్చేసింది. తప్పనిసరై పోయింది. మనం సుఖంగా జీవిస్తున్నామా అన్నది మనకే తెలీని జీవన విధానంలో జీవిస్తున్నాం. కూతుళ్ళకులాగే కొడుకులకు కూడా ఏడాది కొకసారైనా వచ్చి చూసి వెళ్లలేని స్థితిలో బతుకుతున్నాం.

ఈ పరిస్థితిని నేను గుర్తిస్తూ, గుర్తు చేసుకుంటూ ఆలోచిస్తూ హాల్లో కూర్చున్నాను. ఎందుకంటే, మరో పదిహేనురోజుల్లో మా అబ్బాయిలు ముగ్గురూ సకుటుంబంగా ఓ పదిరోజులు మాతో గడపడానికి వస్తున్నారు. మాకు చాలా సంతోషంగా వుంది.

అంతలో చంద్రం వచ్చాడు. చకచక పకపక రచనతో కొద్దిసేపు మాట్లాడాడు. ఆ తరువాత పకపక నవ్వుతూ నా దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. నల్లని మబ్బుల వల్ల వెన్నెల మసకబారుతుంది కానీ, చంద్రం మనసు మాత్రం ఎప్పుడూ చల్లని తెల్లని వెన్నెల్లాగే వుంటుంది. అతడు పకపక నవ్వినా అతని మనసు మాత్రం చల్లని వెన్నెల్లా చల్లని చిరునవ్వులు నవ్వుతుంది. అటూ ఇటూ చూసి, నాకు దగ్గరగా జరిగి నా మొహంలోకి లోతుగా చూశాడు.

'ఎవరికీ చెప్పకుండా, ఎవరికీ తెలీకుండా ఆ పని చేసేశావ్ ! రచనకి ఎవరి ద్వారానో తెలిసిపోయింది. నీ కొడుకులకీ, కోడళ్లకీ తెలీకుండా ఏం చేద్దామనుకుంటున్నావ్? ఏం చెబుదామనుకుంటున్నావ్? అందరూ పదిహేనురోజుల్లో వస్తున్నారు కదా!'

'నేను దాని గురించి ఆలోచించడం లేదు. ఆలోచించాల్సిన అవసరమూ లేదు'

'నీ మనసుని నేను నా గుండె అద్దంలో చూస్తున్నాను. అద్దం అబద్ధం చెబుతుందేమో కానీ, నా గుండె అద్దం ఎప్పుడూ అబద్ధం చెప్పదు ! నువ్ దాని గురించే ఆలోచిస్తున్నావ్! ముగ్గురబ్బాయిలూ సకుటుంబంగా అందరూ ఒకేసారి వస్తున్నప్పుడు ఎంతో సంతోషంగా వుండాల్సిన నువ్వు అంత సంతోషంగా లేవు ! నువ్ చేసిన తప్పు నీ సంతోషాన్ని తినేస్తోంది!' అన్నాడు.

నేను మరింకేమీ మాట్లాడలేక పోయాను.

'నువ్ ఏం చేసినా వాళ్లకి తెలీకుండా వుండదు. రచనే చెప్పకుండా వుండలేదు. ఏదో విధంగా ఎలాగైనా తెలిసిపోతుంది కాబట్టి నువ్వాపని చెయ్ ! నోరు మూసుకుని మౌనంగా వుండిపో! నీ కది బాగా తెలుసు కదా !' అని చెప్పి విషాదంగా నా మొహంలోకి చూస్తూ వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

మా అబ్బాయిలు సకుటుంబంగా వచ్చారు. ఇంట్లో పేరుకు పోయిన నిశ్శబ్దమంతా ఒక్కసారిగా ఎక్కడికో పారిపోయింది. సరదా కబుర్లు... హాస్యాలు.... నవ్వులు.... మనవల ఆటలూ పాటలూ.... ఇల్లంతా సంతోషంతో పులకరించిపోతోంది.

అంతలో వీధి గేటు చప్పుడు. చంద్రం వస్తున్నాడు. చంద్రం వస్తే, చల్లని వాయువూ చల్లని వెన్నెలా చేతులు కలుపుకుని ఒకేసారి మా ఇంట్లో ప్రవేశించినట్లుంటుంది. అయితే ఈసారి నాకలా అనిపించలేదు. చల్లని వాయువు విషవాయువుగా మారి మా ఇంట్లో శత్రువులా ప్రవేశిస్తున్నట్లనిపించింది. ఇదేంటి? దీన్ని ఏమని చెప్పుకోవాలి? తప్పు చేసినవాడు తన తప్పు అయిన వాళ్లందర్లో బయటపడుతుందనే భయంతో అలా అనుకుంటాడేమో ! నేను చేసింది తప్పు ఎంత మాత్రం కాదని నా మనసుకు బాగా తెలుసు. అయినప్పటికీ నాకెందుకలా అనిపిస్తోందో నేను తెలుసుకోలేకపోతున్నాను. మా అబ్బాయిలు ఎదురుగా వెళ్లి చంద్రాన్ని ఆప్యాయంగా, గౌరవంగా ఆహ్వానించారు. మా కోడళ్లూ రచనా కూడా గబగబా వచ్చి వినయంగా గౌరవంగా ప్రేమగా ఆహ్వానించారు. మా మనవలు చినతాత గారొచ్చారంటూ సంతోషంగా అతణ్ని చుట్టుముట్టారు.

చంద్రం గలగల ప్రవహించే సెలయేరులా గడగడ గలగల మాట్లాడుతున్నాడు. అందర్నీ గలగల నవ్విస్తున్నాడు. నా మనస్సు ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూనే వుంటుంది. అయితే నేను నవ్వడం చేత కాని మనిషిలా పైకి కనిపిస్తాను. అందువల్ల ఇతరులను సులువుగా ఆకట్టుకునే ఆకర్షణ నేను సంపాదించలేకపోయాను. చంద్రం ఆవిధంగా గొప్ప ఆస్తిపరుడు.

కొంతసేపు చంద్రంతో మాట్లాడి రచనా కోడళ్లూ లోపలికి వెళ్లిపోయారు. మా మనవలు ఆడుకోడానికి వెళ్లిపోయారు. చంద్రం మా అబ్బాయిల్తో మాట్లాడుతున్నాడు. వాళ్ల ఉద్యోగాల గురించి, వాళ్లు పని చేస్తున్న వూళ్ల గురించి, అక్కడున్న పర్యాటక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకుంటున్నాడు. మాటల సందర్భంలో మా అబ్బాయిలు చంద్రంతో ఓ మాట అన్నారు. 'మా నాన్నగారు చేసిన పని మాకెంతో సంతోషంగా వుంది. మంచి పని చేశారు'. అని ప్రశంసాపూర్వకంగా నా మొహంలోకి చూశారు. కొంతసేపు మరికొన్ని కబుర్లు చెప్పుకున్నాక మా అబ్బాయిలు లోపలికి వెళ్లిపోయారు.

చంద్రం నాకు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. 'నువ్ కిందటి జన్మలో గొప్ప నటుడివై వుంటావ్! అదే మీ అబ్బాయిలకూ అబ్బినట్లుంది ! ఎంత బాగా నటించి నువ్ చేసిన పనిని మెచ్చుకున్నారో ! అంతేకాదు, నిజానికి వాళ్లు సంస్కారవంతులు. నీపట్ల వాళ్లకి ఎంతో ప్రేమ గౌరవం వున్నాయ్. అందుకే బాధను గుండెపొరల్లో నీకు తెలీకుండా మండించుకుంటున్నారు ! వాళ్ల మెచ్చుకోలు ఓ గొప్ప నటన !' అని తడుముకోకుండా దడదడ చెప్పేసి నా మొహంలోకి విషాదంగా చూశాడు.

ఆరోజు మా అందరితో కలిసి భోం చేసి ఆనందంగా గడపాలని అందరూ అడగ్గా ఒప్పుకున్నాడు. వంటింటిలోకి వెళ్లి ఏమేమి వండాలో చెప్పడమే కాకుండా ఎలా వండాలో కూడా చెబుతూ కొంతసేపు గడిపాడు.

అందరం భోజనాల బల్లదగ్గర చేరాం. భోజనాలు ప్రారంభించాం. చంద్రం అందరినీ గలగల నవ్విస్తున్నాడు. కొండల్లో పుట్టి గలగల ప్రవహించే సహజ స్రవంతిలా అందరం గలగల నవ్వుకుంటున్నాం.

ఆసందర్భంలో మా కోడళ్లు చంద్రంతో ఓ మాట అన్నారు. మా 'మామగారు చేసిన పని మాకెంతో ఆనందంగా వుంది. మేమందరం ఎంతో సంతోషిస్తున్నాం. మేమే కాకుండా మా పిల్లలు కూడా గర్వంగా చెప్పుకునే పని చేశారు!' అని అందరూ ఆనందంగా నా మొహంలోకి చూశారు. నేనూ చాలా ఆనందించాను.

భోజనాలు పూర్తయ్యాయి. నేను హాల్లోకి వెళ్లి కూర్చున్నాను. చంద్రం నాకు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. 'నువ్ చేసిన పనిని వాళ్లందరూ నిజంగా సమర్థిస్తున్నారనీ మెచ్చుకుంటున్నారని అనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుంది. చేజారిపోయాక చేయగలిగిందేమీ లేదని అలా అందరూ మాట్లాడుతున్నారు ! అంతే !' అని నాతో చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

మా అబ్బాయిల తిరుగు ప్రయాణం రోజు వచ్చేసింది. ఎవరి సామాన్లు వారు సర్దుకున్నారు. చంద్రం వచ్చాడు. ఆరోజంతా మాతోనే వున్నాడు. మేం కూడా రైల్వే స్టేషనుకి వెళ్లాం. సామాన్లు రైలు పెట్టెల్లో ఎక్కించి భద్రంగా సర్దాం. చిరునవ్వులతో అందర్నీ సాగనంపాం. పదిరోజులు అందరూ కలిసి సంతోషంగా గడిపినందుకు అందరూ సంతోషాన్ని తెలియజేస్తూ అందరూ సంతోషంగా వారి వారి నగరాలకు వెళ్లిపోయారు.

నేనూ, రచనా, చంద్రం తిరిగి ఇంటికి వచ్చేశాం. చంద్రం నాకు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

'నువ్ చేసిన తప్పుపట్ల అందరూ సంతోషాన్ని నటించి, సంతోషాన్ని తెలియజేశారు! నిజంగా వాళ్ళెవరూ కూడా సంతోషంగా లేరు. నాకొకటి అనిపిస్తోంది. వాళ్లెవరూ కూడ మళ్లీ మీ ఇంటికి రారనిపిస్తోంది !' అని విషాదంగా చెప్పి విషాదంగా ఇంటికి వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

కాలం ఓ గమనం. సమాజం ఓ గమనం. మార్పు ఆ గమనాన్ని నిర్దేశిస్తుంది. మార్పుని అడ్డుకునే శక్తులు ఎల్లవేళలా ఎప్పుడూ వున్నట్లుగానే. మంచి మార్పుకోసం శ్రమించే శక్తులు కూడా ఎల్లవేళలా ఏదో విధంగా ఏదో మార్గంలో ఏదో రూపంలో పని చేస్తూ వుంటాయి. ఇది సమాజతత్వం.

ఇదివరకటి లాగే,ఎప్పటిలాగే, ఇప్పుడు కూడా మా కుటుంబం అందరం ప్రేమగా, ఆత్మీయంగా, ఆనందంగా, సుఖంగా జీవిస్తున్నాం. ఇది వరకు ఏడాది కొకసారే మా అబ్బాయిలు వస్తూండేవాళ్లు. ఇప్పుడు వాళ్లు సకుటుంబంగా ఆరు నెలలకోసారి వీలు కల్పించుకుని వస్తున్నారు. ఆనందంగా కొద్ది రోజులు మాతో గడుపుతున్నారు.

ఇదంతా చంద్రం గమనిస్తున్నాడు. ఓ రోజున అందరి ముందు ఓ మాట అన్నాడు.

'పిల్లలకు ఆస్తులు సంపాదించి ఇవ్వాలనే జీవన విధానంలో మన సమాజం కూరుకుపోయింది. ఆ వేటలో అక్రమ ధనార్జన అలవాటుగా మారిపోయింది. అది అవినీతి, దోపిడీ, హింస, నేరం వంటి పలు మార్గాల్లో సామాజిక విధ్వంసాన్ని సృష్టిస్తోంది. నువ్వు ఆ జీవన విధానాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నావు.... పిల్లలకు స్వశక్తితో జీవించగలిగే జ్ఞానం శక్తి ఇవ్వాలనీ, స్వశక్తితో ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడి కష్టించి, శ్రమించి జీవించాలనీ లక్ష్యంగా పెట్టుకున్నావు. ఆ మార్గంలో వాళ్లను పెంచి పెద్దవాళ్లని చేశావు...నీ పిల్లలకు సక్రమ జీవన విధానాన్ని నిర్దేశించావు. నేర్పావు... నీకు ఆరు ఎకరాల భూమి వుంది. అది నువ్వునీ పిల్లలకు ఇవ్వలేదు. కూలిపని కోసం వూరు వదిలేసి వెళ్లిపోతున్న మూడు కుటుంబాలకు ఉచితంగా ఆ భూమిని రాసి ఇచ్చేశావు. వాళ్లకి బతుకు తెరువు ఇచ్చావు. వలసలు ఆపావు. నీ పిల్లలు నువుచేసిన పనిపట్ల సంతోషించారు... నీ ఆలోచనా విధానం నాకు తెలుసు. త్యాగాల వల్ల ఒకరికో ఇద్దరికో కొంత మేలు జరుగుతుంది. అయితే, అది ప్రజాసమస్యకు పరిష్కారం కాదు. అది నీకు తెలుసు.... పిల్లలకు ఆస్తులు సంపాదించి ఇవ్వాలనే జీవన విధానం పోవాలన్నదే నీ లక్ష్యం. నువ్వు ఆచరించి చూపించావు. సంతోషం' అని అందర్నీ చంద్రం ఆశ్చర్యంతో ఆనందంలో ఉరకలు వేయించాడు.




నా గురుదేవులు
శ్రీ మురుగ భూషణమ్‌గారు
(నవశక్తి నిలయమ్, చెన్నై)

భారతదేశములో అతిపెద్ద జ్యోతిష్య గ్రంథాలయము గల ఏకైక సంస్థ

సాయి త్రిశక్తి నిలయమ్

(జ్యోతిష్య పరిశోధనా కేంద్రం)



రాజర్షి - బ్రహ్మర్షి
దైవజ్ఞ కె. అచ్చిరెడ్డి B.sc.,
జ్యోతిష్య - రత్న - వాస్తు శాస్త్ర - పరిశోధకులు



ESTD : 1977

సరస్వతీమహల్, MIG 132/1, HB కాలనీ, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ-520 012 ఫోన్: 2417796

జ్యోతిష్య వాస్తు - హస్త సాముద్రిక - రత్న శాస్త్రాలలో సుమారు 30 సం॥రాల అనుభవజ్ఞులు, దేవీఉపాసకులు, దైవజ్ఞ - రాజర్షి బ్రహ్మర్షి కె. అచ్చిరెడ్డి గారు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖుల భవిష్యత్ ఫలితాలను చెప్పి మన్ననలు పొందియున్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు - సత్కారాలు పొందియున్నారు.